క్లుప్తంగా

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

విశాఖ విద్య: కాకినాడలో జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల పోస్టర్లను రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు మంగళవారం ఆవిష్కరించారు. ఎస్‌పీడీలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా ఆఫీస్ బ్యారర్ల సమావేశంలో పోస్టర్ ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడారు. ఫెడరేషన్ 50వసంతాల వేడుకకు జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టి.ఆర్.అంబేద్కర్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఎస్.ఎస్.నాగమణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అప్పారావు, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, గౌరవాధ్యక్షుడు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

జాకీర్ హుస్సేన్‌కు నివాళి



జాకీర్ హుస్సేన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీఠం సభ్యులు

గోపాలపట్నం: ప్రముఖ తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్‌కు గోపాలపట్నం కళాసేవా పీఠం సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కళాసేవా పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములు మాట్లాడుతూ జాకీర్ హుస్సేన్ మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో కళాసేవా పీఠం అధ్యక్షుడు గౌరపల్లి బంగార్రాజు, గౌరవాధ్యక్షుడు చందు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కొంతం నూకేశ్వరరావు, టి.రామారావు, ఎం.అప్పారావు, జి.రామదాసు, నరసింహం తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



పూజలో పాల్గొన్న కార్పొరేటర్ గల్లా చిన్నా

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన నిర్వహించారు. గతంలో ఉన్న కమ్యూనిటీ హాలును తొలగించి, దాని స్థానంలో కొత్తది నిర్మించనున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు గల్లా చిన్నా పూజ చేసి, నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో గూడెల కృష్ణ, పుక్కల కృష్ణ, రమణ, ధర్మ, విష్ణు, రమేష్, జీవీఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

అమిత్‌షాపై చర్యలకు వినతి

మహారాణిపేట: అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కోరారు. మంగళవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పెదపెంకి శివప్రసాదరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో కించ పరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని రాష్ట్రపతికి విశాఖ జిల్లా కలెక్టర్ ద్వారా విన్నవించుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శులు బోని కృష్ణ, కదిరి రాము, పార్టీ నాయకులు భాగం గోపాలరావు, భీమరశెట్టి విశ్వనాథం, జిల్లా ఇన్‌చార్జి అన్వేష్, ప్రధాన కార్యదర్శి అరుగుల ధనుంజయరావు, జిల్లా ఉపాధ్యక్షుడు అతుకంశెట్టి రామచంద్రరావు పాల్గొన్నారు.



ఆయాల ఆకలి కేకలు

- ఆరు నెలలుగా అందని వేతనాలు
- కుటుంబ పోషణకు అప్పులపాలు
- స్పందించని అధికారులు



తరగతి గదులు శుభ్రం చేస్తున్న ఆయా

మధ్యాహ్న భోజనాలు వడ్డిస్తున్న హెల్పర్

కంచరపాలెం: జీవీఎంసీ పాఠశాలల్లో పని చేస్తున్న అయాలు ఆరు నెలలుగా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. ఇన్ని నెలలు జీతం ఇవ్వకుంటే కుటుంబాలు గడిచేదెలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంచరపాలెం పరిధిలో రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల, కంచరపాలెం, ఆర్పీపేట, కె.కాలనీ ప్రాథమిక పాఠశాలలు, ఐటీఐ జంక్షన్ పరిధిలో సుభాష్‌నగర్, ఆశవానిపాలెం, కరాస, దుర్గాపురం, సాకేతపురం పాఠశాలలు, ఇండస్ట్రియల్ పరిధిలో శ్రీహరిపురం, మల్కాపురం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 46 మంది ఆయాలు పని చేస్తున్నారు. మధ్యాహ్న భోజన వడ్డింపు సమయంలో సహాయకులుగా, టాయిలెట్లు, తరగతి గదులు, వరండాలు, పాఠశాలల ఆవరణలు శుభ్రం చేయడం వంటి విధులు నిర్వర్తిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తమను విధుల్లో నియమించారని, రెండు నెలల వేతనాలు ఒకేసారి అకౌంట్‌లో పడేవని, ఇప్పుడు ఆరు నెలలుగా నిరీక్షణే మిగిలిందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వంలో వేతనాలు పెరుగుతాయనుకుంటే, పెంపు మాట ఎలా ఉన్నా, సమయానికి వేతనాలు రాక అప్పులపాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో కష్టపడుతున్నా..

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మూడు సమయాల్లో అంటే ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం బాత్‌రూమ్‌లను శుభ్రం చేసే పనులు చేస్తున్నామని, మధ్యాహ్న భోజన పథకంలో ప్లేట్లు శుభ్ర పరచడం, విద్యార్థులకు వడ్డన చేస్తున్నామని చెప్పారు. వేతనాలు పడక ఇబ్బంది పడుతున్నామని, ఆయా సంఘాల ప్రతినిధులు అధికారులను కలసి వినతిపత్రాలు అందించినా జీతాలు పడలేదన్నారు. డిసెంబరు నెలాఖరు నాటికి వేతనాలు తమ ఖాతాల్లో వేయకుంటే పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తమ ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని కోరుతున్నారు.



ఆర్పీపేట ఉన్నత పాఠశాలలో టాయిలెట్లు క్లీన్ చేస్తున్న ఆయా

మా పిల్లలకు సరైన తిండి కూడా పెట్టలేకపోతున్నాం



ఆరునెలలుగా జీతాలు ఇవ్వక పోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాం. నా జీతమే మా ఇంటికి ఆధారం. దీంతో ఇంట్లో పిల్లలకు సరైన తిండి కూడా పెట్టలేకపోతున్నాం. ఎంతో కష్టపడి పని చేస్తున్నాం. మాలాంటి చిన్న ఉద్యోగుల జీతాలు ఆపితే ఎలా? అధికారులు ఆలోచించాలి.

– పొదుగు లక్ష్మి, ఆయా, రామ్మూర్తిపంతులుపేట హైస్కూల్

అప్పులు చేస్తున్నాం



పాఠశాలల్లో పనిభారం ఎక్కువైంది. అంత పని చేస్తున్నా మా జీతాలు మాత్రం సమయానికి ఇవ్వడం లేదు. ఇల్లు గడవక అప్పులు చేసి నెట్టుకొస్తున్నాం. వడ్డీలు కట్టలేకపోతున్నాం. ఇలా ఎన్నాళ్లు గడపగలం. అధికారులు దయ చూపాలి. మాకు వేతనాలు చెల్లించాలి.

– పైడమ్మ, ఆయా, ఆర్పీపేట పాఠశాల, కంచరపాలెం

అధికారులు స్పందించాలి



ఒక్క నెల జీతం పడకపోతేనే అల్లాడిపోతాం, అలాంటిది ఆరు నెలలు జీతాలు వేయకుంటే కుటుంబాలు ఎలా గడుస్తాయి? ఆయాల కష్టాలు అధికారులు గుర్తించాలి. వేతన బకాయిలు చెల్లించాలి.

– మణి, కుకింగ్ హెల్పర్, కంచరపాలెం

ఏయూ అథ్లెటిక్స్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఆచార్య విజయ మోహన్ తదితరులు

విశాఖ విద్య : ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే ఏయూ అథ్లెటిక్స్ పురుషులు, మహిళల జట్లను మంగళవారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు అథ్లెటిక్స్ జట్లను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఇంటర్ యూనివర్సిటీ క్రీడల్లో ప్రతిభ సాధించి ఏయూకు మంచి పేరు తేవాలని సూచించారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్‌వీ జయమోహన్ మాట్లాడుతూ ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలు భువనేశ్వర్ కిట్ యూనివర్సిటీలో ఈ నెల 26 నుంచి 30 వరకు జరుగుతాయన్నారు. ప్రతిభ సాధించిన క్రీడాకారులు యూనివర్సిటీ పురుషులు, మహిళల జట్టుకు 19 మంది ఎంపికయ్యారని తెలిపారు. జట్టు కోచ్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల పీడీ అప్పారావు, గణేష్ పాల్గొన్నారు.

చలిగాలులు.. జడివాన



గోపాలపట్నంలో కురుస్తున్న వర్షం

గోపాలపట్నం: వాన వదలడం లేదు. బంగాళాఖాతంలో అల్పపీడనంతో వారం రోజులుగా ముసురుకున్న మబ్బులు వీడడం లేదు. మధ్యలో ఒక్కరోజు తెరపిచ్చినా, మళ్లీ ముసురు కమ్ముకుంది. వర్షానికి తోడు చలిగాలులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వర్షంతో రోడ్డుపై నీరు నిలిచిపోతోంది. జడివాన కురియడంతో పాదచారులు, వాహనచోదకులు నీడ కోసం పరుగులు తీస్తున్నారు. ఉత్తరాంధ్రలో మరో రెండురోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందన్న వాతావరణ శాఖ సమాచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట

పోస్టర్ విడుదల చేసిన మళ్ల విజయప్రసాద్

మల్కాపురం: తాను అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెరగకుండా చూసుకుంటామని ఎన్నికలలో హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు, వాటిని విస్మరించి చార్జీలను పెంచడం ఎంతవరకు న్యాయమని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ప్రశ్నించారు. పెరిగిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఈ నెల 27న చేపట్టనున్న పోరుబాటకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆయన విడుదల చేశారు. మళ్ల క్యాంప్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నమ్ముకున్న ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమన్నారు. గతంలో 6వందల హామీలు ఇచ్చి, ఏ ఒక్కటీ నెరవేర్చని చంద్రబాబు ఇప్పుడు సూపర్ సిక్స్ పేరిట మళ్లీ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న పోరుబాటను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో 40, 57, 60, 62 వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, ముర్రు వాణి, పి.వి.సురేష్, బల్లా లక్ష్మణరావు, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, డీకే ఫౌండేషన్ చైర్మన్ దొడ్డి కిరణ్, వాణిజ్య విభాగం మాజీ అధ్యక్షుడు బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి, పార్టీ వార్డు అధ్యక్షులు ఆడారి శ్రీను, పిన్నింటి అప్పలరాజు, రేవళ్ల సత్యనారాయణ, నాయకులు గులిగిందల కృష్ణ, పెద్దాడ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న మళ్ల విజయప్రసాద్ తదితరులు

ఈదురు గాలులకు తెగిన విద్యుత్ తీగలు

తప్పిన ప్రమాదం



తెగిన విద్యుత్ తీగల వద్ద అడ్డుగా ఏర్పాటు చేసిన బల్లలు



మరమ్మతులు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ కూడలి పరిధిలో సిద్ధార్థనగర్ నుంచి భవానిగార్డెన్స్‌కు వెళ్లే మార్గంలో మంగళవారం వేకువజామున ఈదురు గాలుకు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఆ సమయంలో అటుగా ప్రజలు రాకపోకలు సాగించకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. స్థానికులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.కె. నాయుడు నేతృత్వంలో సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని, మరమ్మతు పనులు చేపట్టారు. విద్యుత్ స్తంభాలకు ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు కాలం చెల్లడంతో తెగిపడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈదురుగాలులకు తెగిన విద్యుత్ తీగల వైపు రాకపోకలు జరగకుండా స్థానికులు అడ్డుగా బల్లలు వేశారు. సిబ్బంది మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తాం



విద్యార్థులతో ఐఐపీఈ ఆచార్యులు

ఐఐపీఈ డైరెక్టర్ ఆచార్య శాలివాహన్

విశాఖ విద్య : విద్యార్థుల అభ్యున్నతికి ఐఐపీఈ ద్వారా తోడ్పాటు అందిస్తామని ఆ సంస్థ డైరెక్టర్ ఆచార్య శాలివాహన్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు 'జిజ్ఞాస' పేరిట ఆంధ్రా యూనివర్సిటీలో మూడు రోజులపాటు శిక్షణ ఇచ్చినట్లు మంగళవారం తెలిపారు. పాఠశాల పిల్లల్లో సైన్స్, ఉన్నత విద్యపై ఆసక్తి పెంచేలా ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నుంచి 26 మంది విద్యార్థులు, 19 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారని వెల్లడించారు. ఇదే మాదిరి భవిష్యత్‌లోనూ వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రిజిస్ట్రార్ రాంఫాల్ ద్వివేది, డీన్ విజయ్ కుమార్ కొప్పార్తపు, ప్రొఫెసర్ అంబటి శేషగిరి రావు, కోర్సు కో – ఆర్డినేటర్లు ఆచార్య అపరాయ్, ఆచార్య రంధి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, స్కూల్ బ్యాగులు, ప్రోత్సాహకంగా రూ.2 వేల చెక్ అందజేశారు. ఉపాధ్యాయులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు.





క్రిస్మస్ శోభ

- చర్చిల్లో విద్యుద్దీపాలంకరణ
- భక్తితో క్రైస్తవుల ప్రార్థనలు

విశాఖ విద్య: క్రిస్మస్‌కు సర్వం సిద్ధమైంది. పశ్చిమ నియోజకవర్గంలో చర్చిలు విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా దర్శనమిస్తున్నాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రార్థనలు మొదలయ్యాయి. ఎస్‌పీడీ సెంటర్‌లోని చర్చి, జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్‌లోని సేవియర్ లూథరన్ చర్చి, బుచ్చిరాజుపాలెంలోని సెయింట్ థామస్ చర్చి, ఎస్‌పీడీ కొత్తరోడ్‌లోని యునైటెడ్ క్రైస్ట్ చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. క్రిస్మస్‌కు అవసరమైన సామగ్రి, కొత్తబట్టల కొనుగోళ్లతో మార్కెట్‌లో సైతం సందడి నెలకొంది. దుకాణాల వద్ద క్రిస్మస్ పండగకు సంబంధించిన స్టార్, క్రిస్మస్ ట్రీ, శాంటాక్లాజ్ తదితరాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.



ప్రార్థన చేస్తున్న మాత జయకుమార్

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జింక్ అప్ వద్ద గల చర్చిలో మాత జయకుమార్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు, చిన్నారులకు వస్త్రాలు, నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏలేటి శాంతి, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

➡ ములగాడ హౌసింగ్‌కాలనీ వద్ద గల ప్రతిభ పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ తోనంగి వెంకట రమణియాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు ఆకట్టుకున్నాయి. చిన్నారుల తెల్లటి వస్త్రాలను ధరించి, క్రీస్తు జననానికి సంబంధించిన గీతాలకు నృత్యాలు చేసి, అలరించారు.

➡ వెంకన్నపాలెం, ప్రకాష్‌నగర్, జనతాకాలనీ వద్ద గల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



సేవియర్ లూథరన్ చర్చి వద్ద క్రిస్మస్ ట్రీ

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీ వద్ద సుమారు 14 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మిస్తున్న సామాజిక భవనం నిర్మాణ పనులను వార్డు కూటమి నాయకులు మంగళవారం పరిశీలించారు. ఇక్కడ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరిట సామాజిక భవనం నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఈ పనులను కూటమి నాయకులు పాండ్రంగి జయరాజ్, రామ్మోహన్‌నాయుడు తదితరులు పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు.

తత్వశాస్త్ర సదస్సు విజయవంతం చేయాలి

- ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు

విశాఖ విద్య : జనవరి 24 నుంచి 26 వరకు ఏయూలో జరిగే 17వ అంతర్జాతీయ ఫిలాసఫీ (తత్వశాస్త్ర) సదస్సును విజయవంతం చేసేందుకు కృషి చేయాలని వీసీ జి.శశిభూషణరావు సూచించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య వి.వెంకటరావు ఆధ్వర్యంలో సదస్సు ఆహ్వాన పత్రికలను వీసీకి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వందేళ్ల ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో ఇటువంటి సదస్సు వర్సిటీ ఖ్యాతి పెంచేలా నిర్వహించాలన్నారు. సదస్సు నిర్వహణకు అవసరమైన నిధులు సమకూరుస్తామని, ఏ సహకారం కావాలన్నా సంప్రదించాలని నిర్వాహకులకు సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో సదస్సు ప్రాముఖ్యతను చాటాలన్నారు. ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నర్సింహారావు, ఆచార్య సత్యనారాయణ, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.



వీసీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆచార్యులు

సరోగసీ దరఖాస్తుల పరిశీలన

మహారాణిపేట: సరోగసీ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. మంగళవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయ సమావేశ మందిరంలో సరోగసీ మెడికల్ బోర్డు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరోగసీ తల్లి వివరాలు, ఆరోగ్య పరిస్థితి పూర్తిగా పరిశీలించాలన్నారు. సరోగసీ కోరుకుంటున్న వారి అర్హత పత్రాలు, విధి విధానాలను కమిటీ సభ్యులకు అందజేశారు. కేజీహెచ్ గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి, పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ బి.చక్రవర్తి ఒక సరోగసీ అనుమతి కోసం అర్హతలు ఉన్నట్లు నిర్ధారించారు. డాక్టర్ బి.చక్రవర్తి సరోగసీ చేసుకునే వారిని కొన్ని ప్రశ్నలు అడిగి సమాధానాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి (డెమో) బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

